మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
సోమవారం 13 ఏప్రిల్ 2026


# ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



**పలమనేరు ఏప్రిల్ 12( మనసులో మాట) :** పలమనేరు పట్టణంలోని దండపల్లె రోడ్డులో గల హజరత్ గంజ్ షహీద్ షవాలి జలాలుద్దీన్ బాబా దర్గా 78వ ఉరుసు మహోత్సవ పోస్టర్లను ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఉరుసుకు విచ్చేయాలని కమిటీ సభ్యులు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి ఆహ్వానించారు.అందులో భాగంగా ఈ నెల 24 న గంధం, 25, 26 తేదీలల్లో ఖవాలి జరుగుతుందని కాబట్టి ఈ కార్యక్రమాలకు విచ్చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఉరుసు కమిటీ సభ్యులు సర్వర్,పర్వీన్, ఏజాస్, ముజీబ్ లతో పాటు పలమనేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

# 'అమరావతి' పై వైసీపీది సెల్ఫ్ గోల్...
# టీడీపీది సెల్ఫ్ డబ్బా

## - కాంగ్రెస్ నేత తులసి రెడ్డి



**కార్వేటినగరం, ఏప్రిల్ 12 (మనసులో మాట):** రాజధాని అమరావతి విషయంలో వైసీపీది సెల్ఫ్ గోల్ కాగా, టీడీపీది సెల్ఫ్ డబ్బా అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం కార్వేటినగరం మండలం పాదిరికుప్పం గ్రామంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజధాని అమరావతి విషయంలో వైసీపీ గందరగోళం, అయోమయంలో ఉందన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని చెప్పారని... అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధాని విశాఖపట్నం మార్చాలని సర్వ ప్రయత్నాలు చేసి జగన్మోహన్ రెడ్డి వైఫల్యం చెందాడన్నారు. మూడు ముక్క లాట ఆడి రాష్ట్ర ప్రజలను గందరగోళం లేక నెట్టాడన్నారు. ప్రస్తుతం మావిగన్ అనగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు అంటూ కొత్త పల్లాయి అందుకున్నాడన్నారు. బహుశా రేపు శ్రీవిపుల్ అనగా శ్రీకాకుళం, విజయవాడ, పులివెందుల అనొచ్చుని... ఎల్లుండి శ్రీకాకుళం, విజయవాడ, కుప్పం అనొచ్చున్నారు. మొత్తంమీద రాజధాని విషయంలో వైసీపీ విధానం నవ్వుల పాలైందన్నారు. రాజధాని విషయంలో టీడీపీ సెల్ఫ్ డబ్బా వాయించుకోవడం ఎక్కువైందన్నారు. గత పది సంవత్సరాలుగా రాజధాని అమరావతి నుండే పరిపాలన సాగుతోందని... ప్రధానమంత్రి రెండు సార్లు శంకుస్థాపన కూడా చేశారన్నారు. ఇది కొత్తది కాదు... అయినప్పటికీ ఏదో అద్భుతం సాధించినట్లు సంబరాలు చేసుకోవడం... డబ్బా కొట్టుకోవడం ఎబెట్టుగా ఉందన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాజధానిలో రాజభవన్, రాష్ట్ర సచివాలయం, శాసనమండలి భవనం, శాసనసభ భవనం, హైకోర్టు, ఇతర మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలన్నారు. ఈనిధుల కోసం కృషి చేయాలని కూటమి ప్రభుత్వానికి తులసి రెడ్డి సూచించారు. అదేవిధంగా రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇంకా వారికి కేటాయించిన రెసిడెన్షియల్ ప్లాట్స్, కమర్షియల్ ప్లాట్లు లేఅవుట్లు వేయలేదని... అభివృద్ధి పరచలేదన్నారు. వెంటనే ఆ పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలో సెక్షన్- 46 సబ్ సెక్షన్-3 ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాలన్నారు. విభజన చట్టంలో సెక్షన్- 85 సబ్ సెక్షన్-2 ప్రకారం కృష్ణానది యాజమాన్యం బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాలన్నారు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము కడప జిల్లాలోసెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడరేవు నిర్మించాలన్నారు. చట్టంలో ఉండి అమలు కాని అంశాల మీద ప్రత్యేక దృష్టి సారించాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమేష్, ఏపీసీపసీ ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కీ రాయల్, గత లోక్సభ ఎన్నికల్లో చిత్తూరు లోక్సభ స్థానానికి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన జగపతి, ఏపీసీసీ మాజీ అధికార ప్రతినిధి బుల్లెట్ రవి, పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త ప్రభాకర్, నగిరి అసెంబ్లీ సమన్వయకర్త కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

**గోవర్ధన్ రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు.**

మాజీ విఆర్ఓ, కార్వేటినగర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధికార ప్రతినిధి అయిన ఎం గోవర్ధన్ రెడ్డి ఈ నెల రెండో తేదీన గుండె జబ్బుతో స్వర్గస్తులయ్యారు. ఆదివారం ఆయన స్వగ్రామమైన ఆర్ కేవీబీపేటలో పెద్ద కర్మ క్రియలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి , కాంగ్రెస్ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు రమేష్, ఏపీ సి సి ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కీ రాయల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ముత్తన్న ఐచర్ రమణ మామా వినయ్ మాజీ ఎంఈఓ జై చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ గోవర్ధన్ రెడ్డి జీడీ నెల్లూరు నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రాజకీయాల పట్ల మంచి అవగాహన ఉండి, క్రమశిక్షణ కలిగిన నాయకుడు అన్నారు.ఆయన మరణం ఆయన కుటుంబ సభ్యులకే కాక కాంగ్రెస్ పార్టీకి కూడా తీరని లోటు అన్నారు. తనకు ఎంతో ఆత్మీయుడని గోవర్దన్ రెడ్డి లేడు అన్న విషయాన్ని ఇప్పటికి జీర్ణించుకోలేక పోతున్నానని తులసి రెడ్డి అన్నారు. గోవర్ధన్ రెడ్డి పవిత్ర ఆత్మకు పరమాత్ముడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి.... వారికి భరోసా ఇచ్చారు.



## పార్లమెంటు సమావేశాల్లో బీసీల వాటాకు తగిన
# ఆమోదం తెలపండి

## రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంకారపు జయ శ్రీ

**ధర్మవరం ఏప్రిల్ 12 (మనసులో మాట)..** ఢిల్లీలోని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఏప్రిల్ 16న జరగనున్న మహిళ రిజర్వేషన్ సవరణ బిల్లుకు అత్యంత కీలకము కానున్నది. చారిత్రాత్మకమైన ఈ బిల్లును ఆమోదింప చేయడమే లక్ష్యంగా నేడు బిజెపి అధిష్టానం సంసిద్ధంగా ఉంది. మహిళా సాధికారత దిశగా మోడీ ప్రభుత్వం చేస్తున్న ఈ అడుగులపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇటువంటి సమయంలో శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా బీసీల యొక్క డిమాండ్లు సమస్యలను ఒక వినతి పత్రం ద్వారా వారు అందజేశారు. అనంతరం సంకారపు జయశ్రీ మాట్లాడుతూ 33 శాతం మహిళలకు అవకాశం ఉన్నందున, ఇందులో బీసీల వాటా ఎంత అని అడగడం జరిగిందని, ఈ విషయంలో ఎన్డీఏ కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అడగాలని విన్నవించడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మహిళల జనాభా 50 శాతం కు పైగా ఉన్నామని, రాబోయే రోజుల్లో చట్టసభల్లో చక్కటి అవకాశం వస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు 33 శాతము రిజర్వేషన్ ప్రకటించడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలపడం జరిగిందని తెలిపారు. కానీ ఈ రిజర్వేషన్ బిల్లులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించాల్సిన అవసరం అనగా బీసీల వాటాలో ఒక ప్రకటన ఇవ్వాలని తాము అడగడం జరిగిందని తెలిపారు. ఈ విషయంలోనే గత సంవత్సరం జిల్లాల వారీగా ధర్నాలు, ఒకరోజు నిరాహార దీక్షలు చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. లోక్సభలో ఏప్రిల్ 16వ తేదీన ప్రవేశపెట్టే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు శాశ్వత ప్రాతిపతకాన ఉండే విధంగా న్యాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రస్తుతం దేశంలోని ఎంపీలు అందరూ కూడా మహిళ బిల్లు 33 శాతం రిజర్వేషన్ విషయంలో సుముఖత చూపుతున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలు 70 శాతం ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ద్వారా 33 శాతం కోటాలో బీసీ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తప్పక న్యాయం చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.



## పలమనేరు గంగమ్మ ఆలయంలో సంప్రోక్షణ

**పలమనేరు ఏప్రిల్ 12( మనసులో మాట) :** శ్రీ తిరుపతి గంగమ్మ జాతర వేడుకల్లో భాగంగా ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం పసుపు నీళ్లతో శుద్ధి చేయడం జరుగుతుందని గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్, పట్టణ కార్యదర్శి గిరిబాబు, గంటవూరు కాలానికి చెందినశ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్ గంగమ్మ గుడి కమిటీ మెంబర్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ... పలమనేరు శాసనసభ్యులు ఎన్. అమర్నాథరెడ్డి సహకారంతో ఈ నెల 26వ తేదీ ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఉన్న పెద్దలు ఎవరైనా సూచనలు తెలపవచ్చునున్నారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి డైరెక్టర్లు అందరూ పాల్గొన్నారు.

## కవియాకూబ్ కు 2025 సృజన సాహితీ పురస్కారం



**పలమనేరు ఏప్రిల్ 12 ( మనసులో మాట):** ప్రముఖ రచయిత కవి జూనియర్ కళాశాల లెక్చరర్ దివంగత కె. శేష పిళ్ళై గారి జ్ఞాపకార్థం అందజేస్తున్న సృజన సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, కవిసంగమం నిర్వాహకులు యాకూబ్ కు అందజేస్తున్నట్లు నిర్వాహకులు మిఠాయి యుగంధర్, ఆర్. మాధవ్ జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. గతంలో ఈ అవార్డును ప్రముఖ కవి బండ్ల మాధవరావుకు అందజేసినట్లు వారు తెలిపారు.

జూన్ మొదటివారంలో పలమనేరులో జరిగే సాహితీ కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవంతోపాటు కవిసంగమం-కవిత్వ వర్క్ షాప్/ కవిసమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య,పలమనేరు రచయితల సంఘం తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి నిర్వాహకులు పలమనేరు బాలాజి,డి.కుమారస్వామి రెడ్డి, పి.తులసినాథం నాయుడు తెలిపారు.ప్రవహించే జ్ఞాపకం, సరిహద్దు రేఖ ఎడతెగని ప్రయాణం, నదీమూలంలాంటి ఆ ఇల్లు తీగలచింత, మనుషులా మనుషులు!"ఆరు కవితా సంపుటాల ద్వారా యాకూబ్ సృజనాత్మకమైన, సమాజానికి అవసరమైన హెచ్చరికలాంటి కవిత్వాన్ని వెలువరించారని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుగా

హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులుగా అంతర్జాల కవితా వేదిక కవిసంగమం వ్యవస్థాపకులుగా రొట్టమాకురేవు కవితా పురస్కారాల నిర్వాహకుడిగా ఉమ్మడిశెట్టి, ఫ్రీవర్స్ ఫ్రంట్ ఇస్మాయిల్,ఆలూరి బైరాగి, సి.నారాయణరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం,పాట్నా నయీధార జాతీయ అవార్డు తదితర సాహిత్య పురస్కారాల గ్రహీతగా విశేషమైన సాహిత్య సేవచేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన హైదరాబాద్ వాసి కవియాకూబ్ కు వారి నిరంతర సృజనను,తెలుగు భాషా సాహిత్య వికాసానికి ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## 12 వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి




**పలమనేరు ఏప్రిల్ 12 ( మనసులో మాట):** రాష్ట్రంలో ఉన్న 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు జూలై 2023 నుండి అమలు చేయవలసిన 12 వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం ఐ.ఆర్ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పలమనేరు తాలూకా యూనిట్ పక్షాన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈసందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురు రాజారావు మాట్లాడుతూ.... గత ప్రభుత్వం ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో 7 వేల కోట్లపైగా చెల్లించి నందులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు జనవరి 2019 నుండి సెప్టెంబర్ 2025 వరకు 108 నెలల డి.ఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎందుకంటే వేలాది మంది పెన్షనర్లు బకాయిలు పొందకనే చనిపోయారని వారి వారసులకైనచెల్లించాలనా ఈవిషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు మానవతాదృక్పదంతో ఆలోచించి పెన్షనర్లకు బకాయిలు చెల్లించడానికి తగు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ.హెచ్.ఎస్. కార్డులపై క్యాష్ లెస్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలనికోరారు. కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుండి 12సం'రాలకు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు ఫ్యామిలీ పెన్షనర్లు చనిపోతే మట్టి ఖర్చులకు ఒక నెల పెన్షన్ ఇచ్చేవారని గత ప్రభుత్వం ఆర్థిక లోటు సాకుతో 25 వేలకు తగ్గించారని నేటి పరిస్థితుల్లో ఖర్చులకు ఏమాత్రం చాలదని ప్రస్తుత ఉత్తర్వులను మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు



**వెదురుకుప్పం, ఏప్రిల్ 12 (మనసులో మాట):** ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండల రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఆదివారం ఏర్పాటు చేశారు. వెదురుకుప్పం మండల పరిధిలోని సర్వే నెంబర్ 231లో గల సుమారు 98 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలో ఉందన్న సమాచారం వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానికుల ద్వారా అందిన ఫిర్యాదులు, సమాచారం ఆధారంగా తక్షణమే స్పందించిన రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులు భూమిని పరిశీలించి, అక్కడ ఎలాంటి అక్రమ నిర్మాణాలు లేదా ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టారు. భూమి చుట్టూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ఇది ప్రభుత్వానికి చెందిన భూమి అని స్పష్టంగా ప్రకటిస్తూ, అనుమతి లేకుండా ఎవరైనా ప్రవేశిస్తే లేదా ఆక్రమణకు యత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా భూమి వద్ద పర్యవేక్షణను కూడా కట్టుదిట్టం చేయాలని నిర్ణయించారు.

ప్రజల తరపున సమస్యను గుర్తించి వెంటనే స్పందించి, అధికారులను అలర్ట్ చేయడంలో చూపిన చొరవకు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడే దిశగా ఇలాంటి చర్యలు మరింత బలోపేతం కావాలని ప్రజలు కోరుతున్నారు.

## పూడిపర్తి విద్యార్థుల క్రియేటివిటీ అద్భుతం



**సర్వేపల్లి /వెంకటాచలం ఏప్రిల్ 12 (మనసులో మాట)..** వెంకటాచల మండలంలోని పూడిపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రియేటివిటీ అద్భుతమని సమగ్ర శిక్ష ఏపిసి వెంకటసుబ్బయ్య విద్యార్థులను అభినందించారు. ఎంటర్ప్రెన్యువల్ మైండ్సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం జిల్లా స్థాయి ఎక్స్పో నెల్లూరు నగరం లోని ఆర్ ఎస్ ఆర్ స్కూల్లో ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా వ్యర్థ పదార్థాలతో పర్యావరణహితంగా చక్కటి అలంకరణ గిఫ్ట్ ఐటమ్స్ ప్రాజెక్ట్ తయారు చేశారు. ప్రాజెక్టు వర్క్ లో జిల్లా స్థాయి కి ఎంపికైన పూడిపర్తి విద్యార్థులను ఉపాధ్యాయులు విద్యార్థులను సృజనాత్మకంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు , వ్యాపార దృక్పథ నైపుణ్యాలు పెంపొందించాలని కోరారు.

ఎంటర్ప్రెన్యువల్ మైండ్సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం జిల్లా స్థాయి ఎక్స్పో నెల్లూరు నగరం లోని ఆర్ ఎస్ ఆర్ స్కూల్లో ఇటీవల జరిగింది.

విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు , వ్యాపార దృక్పథ నైపుణ్యాలు పెంపొందించాలని కోరారు.

ఈ కార్యక్రమం లో అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు, సైన్స్ అధికారి శివా రెడ్డి, ఎంఈఓ మురళీధర్ ఈఎండీపీ జిల్లా మేనేజర్ అనిత, పూడిపర్తి కోఆర్డినేటర్ కరుణ శ్రీ , విద్యార్థులు వినయ్, గణేష్ , ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పెంటర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి



**పలమనేరు ఏప్రిల్ 12( మనసులో మాట) :** గంగవరం మండలంలోని దండపల్లి రోడ్డు ప్రక్కన ఓహోల్ నందు విశ్వకర్మ కార్పెంటర్లు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పెంటర్లను ఉద్దేశించి బావా జన్, అశోక్,రమేష్,రాజా, మహేష్,తదితరులు మాట్లాడుతూ... పట్టణంలో ఉన్నటువంటి కార్పెంటర్లకు సహాయ సహకారాలు అందించడానికి పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ప్రధానంగా వివిధ బ్యాంకుల్లో కార్పెంటర్లకు లోన్లు మంజూరు చేస్తే తాము కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉంటుందన్నారు. కార్పెంటర్ల సమస్యలు ఏవైనా ఉంటే కమిటీ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం లోగోలు క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. కార్పెంటర్ లందరూ సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విశ్వకర్మ కార్పెంటర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునియప్ప, రవి, సుబ్రహ్మణ్యం, బ్రహ్మయ్య, లాలు, అబ్దుల్లా, మునెప్ప, మహబూబ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కామిదొడ్డి గంగమ్మ జాతర

**- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అమర్**

పలమనేరు ఏప్రిల్ 12 ( మనసులో మాట):బైరెడ్డిపల్లి మండలంలోని పెద్ద చల్లారిగుంట పంచాయతీ పరిధిలో గల కామిదొడ్డి గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే ఈ జాతరకు స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా ఆహ్వానించడంతో పాటు దర్శనానంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి సన్మానించారు. ఆ గంగమ్మ తల్లి చల్లని చూపుతో వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని అందరూ సుఖశాంతులతో ఉండేలా ఆ అమ్మవారి కృపాకటాక్షాలు మనపై చూపాలని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బైరెడ్డిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, యువ నాయకులు భువనచంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# బెట్టింగ్‌లు, జూదంపై ఉక్కుపాదం మోపండి

**- ఎస్పీ తుషార్ డూడి**



**చిత్తూరు, ఏప్రిల్ 12 (మనసులో మాట):** జిల్లాలో ఐపీఎల్ బెట్టింగ్‌లు, అక్రమ లాటరీలు, జూద కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో ఆయన నేర నియంత్రణపై కీలక సూచనలు చేశారు. ఐపీఎల్ సీజన్ సాకుతో జరుగుతున్న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు యువతను తప్పుదారి పట్టిస్తున్నాయని, ఇవి కుటుంబాలను ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ నిర్వాహకులపై, జూద కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఎటువంటి రాజీ లేకుండా దాడులు నిర్వహించాలన్నారు. అక్రమ కార్యకలాపాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. "బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు విచారకరం. ఇలాంటి అక్రమ వ్యవస్థలను జిల్లాలో పూర్తిగా నిర్మూలించడమే మా లక్ష్యం." అని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. ఎక్కడైనా అక్రమ బెట్టింగ్ లేదా జూదం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా చిత్తూరు పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005 కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# డీయస్పీగా వెంకటనారాయణ బాధ్యతలు స్వీకరణ



**చిత్తూరు, ఏప్రిల్ 12 (మనసులో మాట):** చిత్తూరు సబ్-డివిజన్ నూతన డీయస్పీగా జె. వెంకట నారాయణ ఆదివారం ఉదయం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన పోలీసు అధికారుల బదిలీలలో భాగంగా, తిరుపతి జిల్లా ఎస్.బి. డీయఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన చిత్తూరుకు బదిలీపై వచ్చారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం సబ్-డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు నూతన డీయస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు.

# స్థానిక' ఎన్నికలలోపు కుల జనగణన జరగాలి

**- బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కుల గణనే ప్రామాణికం - సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు**



**చిత్తూరు, ఏప్రిల్ 12 (మనసులో మాట):** రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లోపు ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన సర్వేను తప్పనిసరిగా నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు నగరంలో ఆర్ముగం అధ్యక్షతన జరిగిన సీపీఐ నగర సమితి సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశ అజెండాను, ప్రాధాన్యతను నగర కార్యదర్శి గోపీనాథ్ వివరించారు. సమావేశంలో రామానాయుడు మాట్లాడుతూ... దేశంలో 2021లో జరగాల్సిన జనగణన జాప్యం జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 1931లో చివరిసారిగా కుల గణన జరిగిందని... ఆ తర్వాత 1941లో జరిగిన డేటా బయటకు రాలేదని గుర్తుచేశారు. సుమారు వంద సంవత్సరాలు కావస్తున్నా సరైన గణాంకాలు లేకపోవడం వల్ల వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే కర్ణాటక, బీహార్, తెలంగాణ రాష్ట్రాల్లో కుల గణనపై ముందడుగు పడిందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీనిని వెంటనే చేపట్టాలని కోరారు. సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే ద్వారా సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ వివరాలను సేకరించడం వలన కులం ఎంత వెనుకబడి ఉందో ప్రభుత్వానికి స్పష్టత వస్తుందన్నారు. దళితులు, గిరిజనులు, బీసీల అభివృద్ధికి నిధులు కేటాయించడానికి ఇది ప్రామాణికంగా మారుతుందన్నారు. రిజర్వేషన్ల పెంపునకు, సామాజిక న్యాయం కల్పించడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందన్నారు. రాజ్యాంగంలోని ఆదేశక సూత్రాల ప్రకారం అన్ని వర్గాలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నూతన ఆర్థిక విధానాల వల్ల వెనుకబడిన వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోని అణగారిన వర్గాలకు విద్య, వైద్య రంగాల్లో న్యాయం జరగడం లేదని రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన ద్వారా మాత్రమే రాజకీయ, సామాజిక అవకాశాలను సమానంగా పంపిణీ చేయడం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి కే. శివారెడ్డి, నగర కార్యదర్శి గోపీనాథ్, సీపీఐ నగర సమితి సభ్యులు విజయ గౌరీ, కుమారి, రమాదేవి, కోమల, దేవయాని, కవిత, ఫైరోజ్, సత్యమూర్తి, దాసరి చంద్ర, విజయకుమార్, రఘు, బాలాజీ రావు, గజేంద్ర బాబు, మణికంఠ, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ జన్మదిన వేడుకలు




**పలమనేరు ఏప్రిల్ 12 ( మనసులో మాట) :** స్థానిక ఏటీఎం సర్కిల్ వద్ద ఆదివారం ఉదయం ఘనంగా మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ జన్మదిన వేడుకలను పలమనేరు, రూరల్ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే .వెంకటే గౌడ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. రోడ్డుపై బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్ రెడ్డి, ఎస్ కే ఎస్ జాఫర్, మురళీకృష్ణ, శ్రీనివాసులు రెడ్డి, సోమచంద్రారెడ్డి, మండి సుధా, నరేష్, ముజ్జు, రఘునాథ్, చెంగారెడ్డి, నాగరాజ్, శ్యామ్, శ్యామ్ సుందర్ రాజ్, మహేష్, ప్రసాద్ రెడ్డి, రమేష్ రెడ్డి, హైదర్, రవి, జయశంకర్, బాబు, కిషోర్, రెడ్డప్ప రెడ్డి, హరీష్, హేమంత్, హేమంత్ యాదవ్, వైసిపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత కంటి శిబిరం ఐదవ రోజు విశేష స్పందన..

**- మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు**



**ధర్మవరం ఏప్రిల్ 12 (మనసులో మాట) ..** మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో నిర్వహిస్తున్న ఉచిత కంటి శిబిరం 5వ రోజు కూడా విజయవంతంగా కొనసాగింది అని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలోకంటి ఆపరేషన్లు పొందిన రోగులతో మంత్రి సత్య కుమార్ యాదవ్ వీడియో కాల్ ద్వారా ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీష్ బాబు మాట్లాడుతూ ఈ శిబిరంలో40 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందని తెలిపారు.మంత్రి చొరవతో సంస్కృతి సేవా సమితి సహకారంతో, అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా ధర్మవరం పోతుకుంట ఏరియా ఆసుపత్రిలో నిర్వహించడం సంతోషించిదగ్గ విషయము అని తెలిపారు. అనంతరం

మంత్రి సత్య కుమార్ యాదవ్, వీడియో కాల్ ద్వారా శస్త్రచికిత్సలు పూర్తి చేసుకున్న రోగులతో , శంకర నేత్రాలయ వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ, శస్త్రచికిత్సల అనంతరం వారి అనుభవాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కంటి చూపు తిరిగి పొందిన ఆనందాన్ని వ్యక్తం చేసిన రోగులతో ముచ్చటిస్తూ, వారి సంతృప్తి తనకు మరింత ప్రేరణనిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అదేవిధంగా ఐదవ రోజు నిర్వహించిన పరీక్షల్లో మొత్తం 99 మంది రోగులు పాల్గొనగా, అందులో 25 మందిని కంటిశుక్లం శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఎంపికైన వారికి ఈనెల 16వ తేదీ వరకు ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

అదనంగా వివిధ దృష్టి లోపాలతో బాధపడుతున్న 20 మందిని మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని బేస్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం జరిగిందన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో ఆరోగ్య రంగంలో మరింత విస్తృత మార్పులు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తరించనున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎం.ఈ.ఎస్.యు భాను ప్రకాష్ రెడ్డి, శంకర నేత్రాలయ ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, బిజెపి నాయకులు బిల్లే శ్రీనివాసులు, సోమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 14 అందరూ ఆహ్వానితులే..

## - ద.బ. ఐక్యవేదిక

### బాబా అంబేద్కర్ భారతదేశ పౌరులకు భాస్కర..

**వెంకటగిరి ఏప్రిల్ 12 (మనస్సులో మాట):** తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు నందుగల అంబేద్కర్ భావన నిర్మాణ స్థలం నందు ఏప్రిల్ 14వ తేదీ జరుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని దళిత బహుజన ఐక్య పోరాట సమితి ఆదివారం పిలుపునిచ్చింది. ఎంతోమంది మహనీయుల త్యాగఫలమే భారతదేశ స్వాతంత్ర్య దేశంగా బ్రిటిష్ వారి నుండి (తెల్లదొరలు ) సాధించుకోగలిగం కానీ భారతదేశయాన్ని నడిపించాలంటే భారతదేశము యొక్క స్థితిగతులను బౌగోళికంగా మార్పు చెందాలంటే అభివృద్ధి చెందాలంటే రాజ్యాంగబద్ధంగా జరగాలి ఈ రాజ్యాంగాన్ని తయారు చేయడానికి రచించడానికి ఎంతోమంది మేధావులను ఏర్పాటు చేసినప్పటికీయును పూర్తిస్థాయిలో( మొదటి నుండి చివరి వరకు ) అందరూ ఉండలే లేక పోయారు అలాంటప్పుడు భారతదేశంలో జీవిస్తున్న దళిత బహుజనుల యొక్క స్థితిగతులను అధ్యయనం చేసినటువంటి మహానుభావుడు మహనీయుడు డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ ఆయనకి కష్టసుఖాలు తెలిసి ఈ సమాజంలో అతను ఎదుర్కొన్నటువంటి అటు పోట్లను స్వయంగా తెలుసుకున్న వ్యక్తిగా బడి గుడి లో అతనికి జరిగిన అవమానాన్ని గ్రహించి పట్టుదలతో రాజ్యాంగాన్ని కుల మధ్య కుల మతాలకు అతీతంగా భారతదేశంలో జీవించే ప్రతి జీవికి స్వేచ్ఛ స్వతంత్ర కలిగి ఉండే విధంగా రిజర్వేషన్ ప్రక్రియ అందులో పొందుపరిచి ఆ రోజుల్లో డిగ్రీ చదివిన వారికే ఓటు హక్కు కల్పించాలని ఉన్న దాన్ని అతికించి భారత దేశంలో జన్మించిన ప్రతి వ్యక్తి 18 సంవత్సరాలు నిండితే ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటు వినియోగించుకోవాలని తెలియజేసి రాజ్యాంగం లో పొందుపరిచిన మహోన్నత గొప్ప మేధస్సు కలిగినటువంటి మహనీయుడు ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. భారతదేశం మహారాష్ట్ర అంబ వాడలో జన్మించిన ఆయనను ప్రపంచ దేశాల్లో అగ్రగామి దేశాలు ఏప్రిల్ 14 ప్రపంచ నాలెడ్జిడేగా ప్రకటించడం భారతీయుడికి గర్వకారణం కాబట్టి ఏప్రిల్ 14వ తేదీ అందరిదీ మన అందరిదీ ఆరోజు ఆయన మనకు ఇచ్చినటువంటి జీవిత సత్యాలను గుర్తు చేసుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడిచే విధంగా ప్రయత్నిద్దాం.. వెంకటగిరి దళిత బహుజన ఐక్యవేదిక సమితి తెలియజేయడం జరిగింది.

# అంబేద్కర్ జయంతి మహా ర్యాలీ..

## - ఏపీ మాదిగ రక్షణ పోరాట సమితి కేశ గాల్లావెంకటేష్



ధర్మవరం ఏప్రిల్ 12 (మనసులో మాట) ధర్మవరం పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14వ తేదీ సాయంత్రం 5గంటలకు మహా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఏపీ మాదిగ రక్షణ పోరాట సమితి నాయకుడు కేశగాల్ల వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని గాంధీ నగర్ సర్కిల్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు మహా ర్యాలీ ఉంటుందని తెలిపారు. ప్రధాన నినాదాలలో సమానత్వం సాధనం, చదువు పోరాడు సంగీతం అవ్వాలి, జాతి కాదు మానవత్వమే గొప్ప, అంబేద్కర్ పేరు ఒక వ్యక్తి కాదు అది ఒక విప్లవం అని తెలిపారు. మా హక్కులను సాధిస్తాం అని తెలిపారు. సమాన హక్కుల కోసం అందరూ ఒకటవుదాం, అంబేద్కర్ మార్గంలో నడుద్దాం, ఈ ర్యాలీని విజయవంతం చేద్దాం అని పిలుపునిచ్చారు.

# విద్యారంగంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలి

## - యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రా రెడ్డి




**ధర్మవరం ఏప్రిల్ 12 (మనసులో మాట)** విద్యారంగంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ జిల్లా కార్యదర్శి అమర్ నారాయణరెడ్డి రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వర కుమారి ధర్మవరం పట్టణంలో యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిమాండ్ చేశారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల్లో దాదాపు 50 శాతం మహిళ ఉపాధ్యాయుల ఉన్నారు అయితే పనిచేసే పాఠశాలలో అనేక చోట్ల కనీస సౌకర్యాలు లేవు లైంగిక వేధింపులు భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవులో వినియోగించడంలో కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం దురదృష్టకరమన్నారు. కుటుంబ బాధ్యతలు విధి నిర్వహణ రెండిటిని సమన్వయం చేసుకుంటూ శ్రమించి పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయుల సంక్షేమానికి రక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు,ప్రభుత్వ పాఠశాలలలో మహిళ ఉపాధ్యాయులకు ప్రత్యేక స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేయాలి అని,పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక టాయిలెట్స్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేయాలి అని,

మహిళా టీచర్ల భద్రతా నిమిత్తం ఒక ప్రొటెక్షన్ సెల్ జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలి అని తెలిపారు. అదేవిధంగా అనారోగ్యం చదువుల నిమిత్తమే కాక పెళ్లయిన బిడ్డలకు తీవ్ర అనారోగ్యం , శాస్త్ర చికిత్స , డెలివరీ సమయాల్లో కూడా వినియోగించే విధంగా చైల్డ్ కేర్ లీవ్ ను మార్పు చేయాలి అని తెలిపారు. తదుపరి మహిళా ఉపాధ్యాయులతో సంతకాల సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి యుటిఎఫ్ పక్షాన రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి మహిళా సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి అమర్నాథ్ రెడ్డి, , జిల్లా కార్యదర్శిలు నాగేంద్రమ్మ, లతా దేవి , మహిళ యుటిఎఫ్ నాయకత్వం మణిమాల ,యాస్మిన్ సుల్తాన్ , రామాంజనేయులు వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియుసి 18 వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## - కార్మికుల సమస్యల పరిష్కారమే ఏఐటియుసి లక్ష్యం

## -ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మి నారాయణ, యామాల మధు




**నెల్లూరు /గూడూరు (మనసులో మాట )ఏప్రిల్ 12:** కార్మికుల సమస్యల పరిష్కారమే ఏ.ఐ.టి. యు.సి లక్ష్యమని ఏ. ఐ.టి. యు.సి జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కొమ్మి నారాయణ , యామాల మధు లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏ. ఐ. టి. యు. సి నియోజకవర్గ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మీరా భాయ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి హెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఏ. ఐ. టి. యు.సి ఉంటుందన్నారు.కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు.

ఈ సందర్భంగా ఏ. ఐ.టి. యు. సి జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కొమ్మి నారాయణ , యామాల మధు మాట్లాడుతూ

కార్మికులకు అండగా ఏ. ఐ.టి. యు.సి అండగా ఉంటుందన్నారు. కార్మికుల సమస్యల పట్ల నిరంతరం ఏ ఐ టి . యు.సి పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు కార్మికుల దృష్టికి తీసుకు వెళ్లి , కార్మికుల సమస్యల పరిష్కార నీ కృషి చేస్తున్నాం అన్నారు. కార్మిక వర్గం అంతా ఏకమై తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలన్నారు. కార్మికుల సమస్యల కోసం నిరంతరం ఏ. ఐ. టి. యు. సి కృషి చేస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల కొరకే వినియోగించాలన్నారు. పెండింగ్ లో ఉన్న క్లెయిమ్ లను వెంటనే విడుదలచేయాలన్నారు.

ఏప్రిల్ 26 నుండి తిరుపతి జిల్లాలో ఏ.ఐ.టి. యు సి. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కార్మికుల కు పిలుపునిచ్చారు. గూడూరు నియోజకవర్గం లో నీ కార్మికులు అందరూ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్.ప్రభాకర్ , సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ , ఏ. ఐ.టి. యు.సి వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు మీరా భాయ్ , ముక్తి యార్ , చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్ , వెంకటయ్య , యాకోబు, కృష్ణ, చెంగమ్మ

మధు, కృష్ణ, నజీర్, వెంకటాద్రి , రిజ్వాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన పురాతన నాణ్యముల ప్రదర్శన

**రాయలసీమ నాణెముల సేకరణ సంఘం అధ్యక్షులు నాగరాజారావు. కళాజ్యోతి కార్యదర్శి బి. రామకృష్ణ.**

**ధర్మవరం ఏప్రిల్ 12 (మనసులో మాట)..** పట్టణంలోని కళాజ్యోతి వారి ఆధ్వర్యంలో పురాతన నాణెముల ప్రదర్శన కళాజ్యోతి ఆవరణములో ఏప్రిల్ 11, 12 రెండు రోజులపాటు కళాజ్యోతి ఆధ్వర్యంలో కార్యదర్శి రామకృష్ణ ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చివరి రోజు అధ్యక్షులు నారాయణ, రాయలసీమ నాణ్యముల సేకరణ సంఘం అధ్యక్షులు కేహెచ్ నాగరాజరావు, కార్యదర్శి వి విష్ణు భగవాన్ , కళాజ్యోతి కార్యదర్శి బి. రామకృష్ణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్రకు సజీవ సాక్షాలు ఈ చారిత్రక నాణెములు అని తెలిపారు. తొలి తెలుగు శాసనమును క్రీస్తు శకం 575లో రేనాటి చోళ రాజు, ధనుంజయ ఎరికల్ ముత్తు రాజు వేయించడం జరిగిందన్నారు. ఈ శాసనం కడప జిల్లాలోని కలమల్ల గ్రామంలో లభ్యమయిందని తెలిపారు. దేశవ్యాప్తంగా మన తెలుగు రాష్ట్రాలలో విద్యాసంస్థల ఆహ్వానం మేరకు ప్రపంచ దేశాల నాణ్యములు నోట్లు వివిధ రాజుల కాలం నాటి పురాతన నాణెములను ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు విద్యార్థులు విజ్ఞానము కొరకు క్రీస్తుపూర్వం క్రీస్తు శకం వరకు వినియోగములోని నాణ్యములతో పాటు ఇండో గ్రీకులు ఇండో సాసానియన్ రాజులు కోటిలింగాల నాణ్యములు శాతవాహనులు ఇచ్చువాక్కులు, సెబికా రాజులు హిరణ్యక ఆనంద గోత్రికులు గుప్తులు విష్ణు కుండీనులు మగధరాజులు పల్లవులు జోలులు ఉజ్జయిని రాజులు తదితరులు వారి కాలము నాది నాణ్యములు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 250 దేశాలకు పైగా నాణ్యములు, ప్రపంచ దేశాల నోట్ల ప్రదర్శన, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధం కాలమనాటి నోట్లు ప్రదర్శనలో ప్రతి ఒక్కరూ వీక్షించవచ్చునని తెలిపారు. ఈ రెండు రోజుల్లో దాదాపు 1,000 మందికి పైగా ప్రజలు వీక్షించి తన సంతోషాన్ని వ్యక్తం చేసి వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ నాణెముల ప్రదర్శన తిలకించుటకు వందల సంఖ్యలో యువతి, యువకులు విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు, సీనియర్ సిటిజన్ వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాజ్యోతి కార్యదర్శి బి రామకృష్ణ, ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, కే రమేష్ బాబు, ఎల్ఐసి రామన్న, కే సోమశేఖర్, సలహాదారుడు ఎస్ రామకృష్ణ, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాడు ఎన్టీఆర్ ఆస్తి హక్కు

# నేడు మోడి, బాబు చట్టసభల్లో రిజర్వేషన్ హక్కు

- పార్లమెంటులో నారీ శక్తి వందన్ అధినియం బిల్లు ప్రవేశపెట్టనున్న ప్రధాని మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి పార్టీల పెద్దలకు ధన్యవాదాలు
- మహిళా రిజర్వేషన్ బిల్లు భారతదేశ చరిత్రలో చారిత్రక ఘట్టం
- స్థానిక సంస్థల మహిళా ప్రజా ప్రతినిధులు తమ పాలనా దక్షతతో ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నారు
- చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడం దేశాభివృద్ధికి శుభపరిణామం
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**నెల్లూరు బ్యూరో (మనసులో మాట ) ఏప్రిల్ 12:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత యిస్తోందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. కేంద్రంలోని ఎన్డిఎ కూటమి ప్రభుత్వం పార్లమెంటులో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నారీ శక్తి వందన్ అధినియం బిల్లు పెట్టనున్న నేపథ్యంలో తెలుగుదేశం, బిజెపి మరియు జనసేన మహిళా నాయకులతో కలిసి నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్ లోని ఆమె కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాలన్న ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయాన్ని భారతదేశ చరిత్రలో చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. గతంలో నందమూరి తారక రామారావు గారు మహిళలకు ఆస్తి హక్కు కల్పించి విప్లవాత్మక మార్పుకు నాంది పలికారని అదే బాటలో చంద్రబాబు నాయుడు గారు మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు వేశారని ఆమె గుర్తుచేశారు. స్థానిక సంస్థలు, ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు.

దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ భారత పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నిర్ణయం దేశ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిగారు పేర్కొన్నారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల ద్వారా సర్పంచులుగా, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఛైర్మెన్లుగా ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులు తమ పాలనా దక్షతతో అద్భుతాలు సృష్టిస్తున్నార న్నారు. పరిమిత వనరులతో కుటుంబాన్ని నడిపే నేర్పు ఉన్న మహిళలు, ప్రభుత్వ వనరులను కూడా వృధా కాకుండా ప్రజా ప్రయోజనాలకు మళ్లించడంలో మేటి అని నిరూపిస్తున్నారని అన్నారు. నెల్లూరు జిల్లాలో సారా ఉద్యమాన్ని నడిపిన దోబగుంట రోశమ్మ గారి స్ఫూర్తితో మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు గుర్తుచేశారు. చట్టసభల్లో మహిళలు ఉంటే అట్టడుగు వర్గాల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు కేవలం ఓటర్లుగానే కాకుండా దేశ గమ్యాన్ని మార్చే నాయకులుగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడం దేశాభివృద్ధికి శుభపరిణామమని పేర్కొంటూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గార్లకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా జరిగిన రిషి విద్యాలయ ప్రథమ వార్షికోత్సవం వేడుకలు

**- పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి**



**ధర్మవరం ఏప్రిల్ 12 (మనసులో మాట)..** పట్టణంలోని రిషి విద్యాలయలో ప్రథమ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని డీన్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాపన తర్వాత నిర్వహించిన ఈ తొలి వార్షికోత్సవానికి ప్రముఖులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొనడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం వినాయక ప్రార్థనతో ప్రారంభమై, అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో ప్రేక్షకులను అలరించడం జరిగిందని తెలిపారు. చిన్నారుల ప్రతిభ, ఆత్మవిశ్వాసం అందరినీ ఆకట్టుకుంది అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, నైతిక విలువలను పాటించాలని తెలిపారు. సిఏఓ రవీంద్ర తన ప్రసంగంలో పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు గోపినాథ్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించబోయే పి5 మోడల్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అలాగే స్పేస్ ల్యాబ్ గురించి వివరించి, దీని ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధనా దృక్పథం పెంపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు, ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించడం జరిగింది అని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారం వల్లే విద్యార్థులు విజయాలను సాధిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలోతల్లిదండ్రులు, ఏ ఓ రంగారెడ్డి , ఉపాధ్యాయులు, విద్యార్థులు , బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.